క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ శివన్నారాయణ

తాళ్లరేవు: మంగళవారం స్థానిక అంబేడ్కర్ భవన్ వద్ద మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్(ఎండీయూడబ్ల్యూఏ) అధ్యక్షుడు పెయ్యల రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ మంగళవారం ప్రారంభించారు. ప్రభుత్వ కార్యాలయాలు అధికంగా ఉన్న చెరువుగట్టు సెంటర్‌లో అందరికీ ఉపయోగపడేలా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తహసీల్దార్ ఎస్.పోతురాజు, ఎంపీడీఓ ఎం.అనుపమ, తాళ్లరేవు, కోరంగి సర్పంచ్‌లు రెడ్డి అరుణసుహాసినీదేవి, పెయ్యల మంగేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పంచాయతీ హోదా కల్పించండి

అల్లవరం: కొమరగిరిపట్నం పంచాయతీలో అంతర్భాగంగా ఉన్న ఎస్.రామేశ్వరం గ్రామాన్ని విడదీసి ప్రత్యేక పంచాయతీగా ప్రకటించాలని కోరుతూ గ్రామస్తులు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి కుమారుడు పినిపే శ్రీకాంత్‌కు వినతి పత్రం ఇచ్చారు. పౌర సేవల నిమిత్తం కొమరగిరిపట్నం సచివాలయం ఆరు కిలోమీటర్ల దూరంలో ఉందని, మా ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదని గ్రామస్తులు తెలిపారు. ఎస్.రామేశ్వరం ప్రాంతానికి ప్రత్యేక పంచాయతీ హోదా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మల్లాడి నరేష్, సత్యనారాయణ, పట్టా రాజు, పూరి జగన్నాథ్, అంగాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సాకుర్రు సర్పంచ్‌కు సత్కారం

అమలాపురం రూరల్: మండల స్థాయిలో ఉత్తమ పంచాయతీ అవార్డు పొందిన సాకుర్రు సర్పంచ్ గుత్తుల చిరంజీవిరావును స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ పెద్దలు పూలమాలతో మంగళవారం సత్కరించారు. సత్కార కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు చొల్లంగి సాయిబాబు, నక్కా సంపత్, ఆకుల సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి రమాశైలజ, జిల్లా టెలికామ్ మాజీ మెంబర్ పాలమూరి ధర్మపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

సాక్షి, అమలాపురం: కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అమరావతి జేఏసీ రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక కలెక్టరేట్ వద్ద కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధర్నా చేశారు. బొప్పరాజు మాట్లాడుతూ 47 రోజులుగా ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. 28న అన్ని ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలు, నాలుగు జేఏసీలు, ఏఐటీయూసీ, సీఐటీయూలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఏపీ జేఏసీ అమరావతి జిల్లా శాఖ అధ్యక్షుడు డి.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జి.చిరంజీవి పాల్గొన్నారు. .

'క్రోధ రసం' పుస్తకావిష్కరణ

అమలాపురం రూరల్: అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాల ఉపన్యాసకుడు దువ్వూరి సుబ్రహ్మణ్య శర్మ, చల్లా కృష్ణవీర్ అభిషేక్‌లు రచించిన 'తెలుగు సినిమాల్లో క్రోధ రసం' పుస్తకాన్ని విశాఖపట్నంలో సినీ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ సతీమణి సౌజన్య మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దర్శక రచయితలకు ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

నాయీ బ్రాహ్మణ సంఘం డైరెక్టర్‌గా శ్రీదేవి



తాళ్లరేవు: ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ సంఘం సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ నాన్ అఫిషియల్ డైరెక్టర్‌గా చొల్లంగి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకురాలు కాపవరపు శ్రీదేవిని ప్రభుత్వం నియమించింది. తనకు పదవినిచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధవటం యానాదయ్యలకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

శివన్నారాయణకు సత్కారం

తాళ్లరేవు: ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన కుడుపూడి శివన్నారాయణను ఉప్పంగల పంచాయతీ తంగేడిపంపు గ్రామస్తులు స్థానిక రామాలయం వద్ద పూలమాలలు, దుశ్శాలువాతో మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా శివన్నారాయణ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఆశీస్సులతో తనకు ఈ పదవి లభించిందన్నారు.

రహదారి.. గోతులపై సవారీ

- యానాం పట్టణంలోని రెండు లైన్ల రహదారి ఛిద్రం
- వర్షాలొస్తే గుంతల్లో నిలిచిపోతున్న నీరు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనచోదకులు


యానాం వద్ద ఛిద్రమైన రెండు లేన్ల రహదారి


ప్రమాదకరంగా గోతులు

యానాం: బైపాస్ రహదారికి చేర్చి యానాం పట్టణ ముఖద్వారం వెంబడి ఉన్న రెండు లేన్ల రహదారి ఛిద్రం కావడంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షాలొచ్చినపుడు రోడ్డు పొడవునా గుంతల్లో నీరు నిలిచిపోతుంది. అమలాపురం, కాకినాడ, విశాఖపట్టణం, రామచంద్రపురం, ద్రాక్షారామ, కుయ్యేరు, ఇంజరం తదితర ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు, ఆటోలు నిత్యం ఇదే దారిలో ప్రయాణిస్తుంటాయి. ద్రాక్షారామ వైపు వెళ్లే ఈ రహదారి వెంబడే హైస్కూల్స్, కళాశాలలు తదితర విద్యాసంస్థలు ఉండటంతో నిత్యం విద్యార్థులు సైకిళ్లపై వెళుతుంటారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తారు రోడ్డుపై గ్రావెల్


యానాంను అనుకుని రెండు లేన్ల రహదారి ఛిద్రమై రెండేళ్లు దాటిపోతుంది. అయినా యానాం పీడబ్ల్యూడీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు పదే పదే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో నాలుగు నెలల క్రితం తారు రోడ్డుపై ఎర్ర గ్రావెల్ వేసి చేతులు దులిపేసుకున్నారు. అనంతరం కొద్దిపాటి వర్షానికే కంకరంతా బయటకు వచ్చేయడమే కాకుండా రోడ్డంతా గోతులమయమైంది. దీంతో వాహనచోదకులు అటుగా వెళ్లడానికే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యానాం పీడబ్ల్యూడీ శాఖ అధికారులు గ్రావెల్ రోడ్డు పేరుతో లక్షలాది రూపాయలు పక్కదారి పట్టించారన్న విమర్శలు సైతం వినిపిస్తున్నాయి.

నిర్వహణకు తీసుకుని నిర్లక్ష్యం

వాస్తవానికి యానాం బైపాస్‌ను చేర్చి ఉన్న ఈ రహదారి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిధిలో ఉండేది. అయితే గోదావరి పుష్కరాల సమయంలో యానాం ముఖద్వారం నుంచి దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వరకూ తాము నిర్వహించుకుంటామంటూ యానాం పాలనా యంత్రాంగం తమ అధీనంలోకి తీసుకుంది. ఆ దారిని రెండు లైన్ల రహదారిగా అభివృద్ధి చేశారు. అయితే అప్పటి నుంచి దాన్ని పట్టించుకోవడం మానేశారు. వాస్తవానికి రహదారి నిర్మాణానికి అంచనాలు రూపొందించినా కేవలం ఈఈ లేరన్న కారణంతో పనులు నిలిచిపోయినట్లుగా తెలుస్తుంది.

> **అంచనాలు రూపొందించాం**
>
> యానాం బైపాస్ నుంచి దివంగత నేత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వరకూ రహదారి పనులకు అంచనాలు రూపొందించాం. దానికి అవసరమైన నిధులు సైతం ఉన్నాయి. అయితే నూతన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వచ్చిన తర్వాత ఆయన అనుమతితో పనులు ప్రారంభిస్తాం.
>
> – కాళ్ల నాగరాజు, పీడబ్ల్యూడీ, ఏఈ, యానాం

ఘనంగా సోమాలమ్మ జాతర



ఉప్పలగుప్తం: స్థానిక గ్రామ దేవత సోమాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి తీర్థం నిర్వహించారు. రాత్రి వేళలో జబర్దస్త్ కళాకారులతో కామెడీ షో నిర్వహించారు.

8న వైద్య పరికరాల వేలం

ముమ్మిడివరం: ముమ్మిడివరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న వైద్య పరికరాలను బహిరంగ వేలం వేయనున్నట్లు ఆసుపత్రి సివిల్ సర్జన్, సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.దయానా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 8వ తేదీ ఉదయం 10 గంటలకు ఆసుపత్రి ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు.

చంద్రప్రభ వాహనంపై వీరేశ్వరుడు


చంద్రప్రభ వాహనంపై భద్రకాళీ సమేత వీరేశ్వరుడు


స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న పండితులు

ఐ.పోలవరం: మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. రాష్ట్ర ఆదిశైవ అర్చక సంఘ అధ్యక్షుడు యనమండ్ర సత్యసీతారామశర్మ ఆధ్వర్యంలో అయిదు రోజుల క్రతువు నిర్వహిస్తున్నారు. ఆలయంలో మంగళవారం ఉదయం గవ్యాంతం, వాస్తు హోమం, అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించిన చంద్రప్రభ వాహనంపై గ్రామోత్సవం ఘనంగా జరిపారు. బ్రహ్మోత్సావాల సందర్భంగా ఆలయ ఆవరణలో భారీ చలువ పందిళ్లు, పచ్చి పూల అలంకరణ, విద్యుత్ దీపాలంకరణ ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణలు పర్యవేక్షిస్తున్నారు.

ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి

వీరేశ్వరస్వామి ఆలయంలో ఆదిశంకరాచార్యుల జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పండితులు నాగాభట్ల రామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో పలువురు పండితులచే ఆదిశంకరులకు ప్రత్యేక పూజలు చేశారు.

దోమల నిర్మూలనతోనే మలేరియా అదుపు

డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ భారతలక్ష్మి


అవగాహన ర్యాలీలో పాల్గొన్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ భారతలక్ష్మి



తాళ్లరేవులో నిర్వహిస్తున్న ప్రపంచ మలేరియా దినోత్సవ ర్యాలీ

అమలాపురం టౌన్: దోమల నిర్మూలనతోనే మలేరియాను అదుపు చేయడం సాధ్యమవుతుందని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో, జిల్లా మలేరియా నిర్మూలన అధికారి డాక్టర్ సీహెచ్‌వీ భారతలక్ష్మి అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అమలాపురం పట్టణ వీధుల్లో మంగళవారం జరిగిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించి ప్రసంగించారు. దోమల వ్యాప్తిని అరికడదాం–మలేరియాను పూర్తిగా రూపుమాపుదాం అనే నినాదంతో అవగాహన ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొని దోమల నిర్మూలనను ప్రతిఒక్కరూ వ్యక్తిగత బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. స్థానిక చంద్రబాబు ఉద్యానవనం వద్ద గల అర్బన్ హెల్త్ సెంటర్ నుంచి ప్రారంభమైన ఈ అవగాహన ర్యాలీ గడియారం స్తంభం సెంటరు వరకూ సాగింది. ర్యాలీలో మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ అనురాధ, డాక్టర్ అమృత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు, వార్డు సచివాలయ శానిటరీ, హెల్త్ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: మండలంలోని కేశనకుర్రు, జి.వేమవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వైద్యులు ఇందిరా శ్రీరామానుజరావు ఆధ్వర్యంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటిద్దాం–ఆరోగ్యంగా జీవిద్దాం అన్న నినాదాలతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మలేరియా వ్యాధిపై అవగాహన, లక్షణాలు, నివారణకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి శుక్రవారం ఫ్రైడేను డ్రైడేగా పాటించాలని వైద్య నిపుణులు సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవులో మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మలేరియా నిర్మూలనపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఇంటింటా పరిశుభ్రత పాటించి, దోమల వ్యాప్తిని అరికట్టి ప్రాణాంతక మలేరియాను పారద్రోలుదామని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.పోతురాజు, హెల్త్ ఎడ్యుకేటర్ పీయూ సీతామహాలక్ష్మి, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

అంధులకు సంత్ సూరదాస్ ఆదర్శం


మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు రాజేశ్వరిని సత్కరిస్తున్న సక్షమ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అంధుడైనా గొప్ప కవిగా, గాయకుడిగా, సంగీత విద్వాంసుడిగా రాణించిన సంత్ సూరదాస్ అంధులందరికీ ఆదర్శప్రాయుడని రాష్ట్ర సక్షమ్ కార్యవర్గ సభ్యుడు శిష్టా శ్రీహరి అన్నారు. సమదృష్టి క్షమతా వికాసం, అనుసంధాన మండలి(సక్షమ్) ఆధ్వర్యంలో స్థానిక శ్రేయ ప్రత్యేక పిల్లల పాఠశాలలో మంగళవారం జరిగిన సంత్ సూరదాస్ 545వ జయంతి వేడుకల్లో శ్రీహరి పాల్గొని మాట్లాడారు. పాఠశాల ప్రిన్సిపాల్ కొర్లపాటి దశరథ రామయ్య సూరదాస్ సాధించిన విజయాలను వివరించారు. ఈ సందర్భంగా అంధురాలైన అమలాపురం మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పుత్సా రాజేశ్వరిని ఘనంగా సత్కరించారు. సక్షమ్ కార్యదర్శి సి.రాఘవేంద్రరావు, పాఠశాల ఉపాధ్యాయురాలు తులసి, పుష్ప, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంధుల పాఠశాలలో...

అంధ కవి, మధుర గాయకుడు సంత్ సూరదాస్ జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక లూయి అంధుల పాఠశాలలో మహిళా వాకర్స్ హెల్త్ క్లబ్ అంధ విద్యార్థులకు భోజన ఏర్పాట్లు చేసింది. పాఠశాల ప్రిన్సిపాల్ రామాయణం శ్రీనివాసరావు, వాకర్స్ క్లబ్ కార్యదర్శి యర్రమల్లి అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భావనా రుషి జయంత్యుత్సవం

యానాం: వైశాఖ శుద్ధ పంచమిని పురస్కరించుకుని యానాంలో కొలువైన భావనారుషి స్వామివారి జయంత్యుత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాలికోట పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, అనంతరం విశేషపూజలు నిర్వహించారు. స్వామివారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అనంతరం ప్రసాద వితరణ నిర్వహించారు.

అదుపు తప్పి ఆటో బోల్తా


కాలువలో బోల్తాపడిన ఆటో

అల్లవరం: డి.రావులపాలెం పంచాయతీ పరిధిలోని బాబానగర్ నుంచి దేవగుప్తం సెంటర్ వైపుగా వస్తున్న ఆటో అదుపు తప్పి సామంతకుర్రు పంట కాలువలోకి మంగళవారం ఉదయం బోల్తా కొట్టింది. ప్రమాదం నుంచి ఆటో డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. పుల్లేటికుర్రుకు చెందిన వ్యక్తి తన ఆటోలో ఉల్లిపాయలను ఊరూరా తీసుకెళ్లి అమ్ముతుంటాడు. బాబానగర్‌లో ఉల్లిపాయలు అమ్ముకుని వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. దీంతో ఉల్లిపాయలు కాలువలో పడిపోయాయి. స్థానికులు స్పందించి ఆటోని రోడ్డుపైకి లాగారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

ఓవర్‌హెడ్ ట్యాంకును ప్రారంభించిన ఎమ్మెల్యే పొన్నాడ


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

ఐ.పోలవరం: కాలనీవాసులు ఏళ్లుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించామని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. మంగళవారం మురమళ్ల పంచాయతీ పరిధి అప్పన్న చెరువుగట్టు వద్ద రూ.74 లక్షలతో నిర్మించిన రక్షిత మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంకు, పైపులైన్ పనులు పూర్తవ్వడంతో ఆయన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ శరవేగంగా నిర్మిస్తున్న 80 ఓవర్‌హెడ్ ట్యాంకులతో నియోజకవర్గంలో తాగునీటి సమస్య పూర్తిగా తీరిపోతుందని పేర్కొన్నారు. తాగునీటి సమస్య పరిష్కరించినందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యేకు స్థానిక మహిళలు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, సర్పంచ్ కాశీ రాజుబాబు, పిన్నంరాజు వెంకటపతిరాజు, పెన్మత్స వాసురాజు, కె.గంగబాబు, వి.రమేష్ తదితరులున్నారు.

అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం


గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులతో మాట్లాడుతున్న శ్రీకాంత్

అల్లవరం: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేసి తీరుతామని మంత్రి పినిపే విశ్వరూప్ కుమారుడు శ్రీకాంత్ అన్నారు. కొమరగిరిపట్నం–2 సచివాలయం పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శ్రీకాంత్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారుల చెంతకే అందిస్తున్నామని తెలిపారు. సంక్షేమంతో పాటుగా అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ప్రతి గ్రామంలో మౌలిక సౌకర్యాల కల్పనకు మంత్రి విశ్వరూప్ శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు శ్రీకాంత్ వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సర్పంచ్‌లు రాకాపు విజయలక్ష్మీ, బర్రె సీతారత్నం, ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్లు సురేష్ రాజు, గుర్రం బాబులు, చెల్లుబోయిన శ్రీను, కడలి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలు


ఆదిశంకరాచార్యుల విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ముమ్మిడివరం: జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతిని పురస్కరించుకుని ముమ్మిడివరం ఉమా సూరేశ్వరస్వామి ఆలయంలో శంకరాచార్యుల విగ్రహం వద్ద మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. హిందు ధర్మాన్ని నలుదిశలా వ్యాప్తి చేయడానికి శంకరాచార్యులు చేసిన కృషిని భక్తులు కొనియాడారు. కార్యక్రమంలో డి.కృష్ణశర్మ, ఎం.శివరామకృష్ణ, ఎన్.శంకరం, ఎస్.శాస్త్రులు, జి.వి స్సులు తదితరులు పాల్గొన్నారు.

రామానుజుని చిత్రపటానికి క్షీరాభిషేకం

అమలాపురం టౌన్: రామానుజుల వారి తిరు నక్షత్రం (పుట్టిన రోజు) సందర్భంగా స్థానిక వాసవీ ఫంక్షన్ హాలులో రామానుజుని చిత్రపటానికి ఆయన భక్తులు మంగళవారం ఉదయం క్షీరాభిషేకం చేశారు. పట్టణానికి చెందిన రామానుజ దాసుడు వరదా సూరిబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పట్టణ వైశ్య సంఘం అధ్యక్షుడు యెందూరి వెంకట్రామయ్య, ఉత్సవ కమిటీ చైర్మన్ నందిపాటి శ్రీనివాసరావు, నూలు కృష్ణ, పచ్చిగోళ్ల రాజా, కాళ్లకూరి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

కిమ్స్‌లో బ్రహ్మోత్సవాలు


వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు చేస్తున్న కిమ్స్ చైర్మన్ చైతన్యరాజు కుటుంబ సభ్యులు

అమలాపురం రూరల్: కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరగనున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సంకల్పం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణ రాజు, లక్ష్మి, కె.రవికిరణ్ వర్మ, శేష పవిత్ర తదితరులు స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెలను చేసి అర్చన నిర్వహించారు. రెండో రోజు బుధవారం వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం జరగనుంది.

కీటక జనిత వ్యాధుల్ని అరికట్టాలి

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- కన్వర్జెన్సీ సమావేశంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా


కలెక్టరేట్‌లో జరిగిన కన్వర్జెన్సీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: మలేరియా, డెంగీ తదితర కీటక జనిత వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన కన్వర్జెన్సీ సమావేశంలో వ్యాధుల నియంత్రణ చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నమోదైన ఏడు డెంగీ కేసులపై సత్వరమే స్పందించి నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. దోమల లార్వాలు ఉత్పత్తి అయ్యే మురికి కుంటలు, పరిసరాలను గుర్తించడంతో పాటు ప్రతి శుక్రవారం డ్రైడే పటిష్టంగా నిర్వహించేలా చూడాలన్నారు. తాజా నీటిలో దోమల లార్వాలు ఎక్కువగా వ్యాప్తి చెందుతాయని, వాటి నిర్మూలనకు మురికికుంటల్లో గంబూషియా చేప పిల్లల్ని వదలాలని సూచించారు. పురపాలక సంఘాల్లోని డ్రైనేజీల్లో ఎప్పటికప్పుడు యాంటీ లార్వా స్ప్రేయింగ్ నిర్వహించాలని పురపాలక సంఘ కమిషనర్లను ఆదేశించారు. వసతి గృహాల్లో విద్యార్థులు డెంగీ, మలేరియా లాంటి వ్యాధుల బారినపడకుండా దోమతెరలు వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రామచంద్రపురంలో సీఎస్ఆర్ నిధులతో ప్లాస్మా సెపరేటర్ యూనిట్ త్వరలో నెలకొల్పుతామని చెప్పారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ పద్మశ్రీ రాణి, డీఎం అండ్ హెచ్‌ఓ ఎం.దుర్గారావు దొర, అదనపు డీఎం అండ్‌హెచ్‌ఓ సీహెచ్‌వీ భరతలక్ష్మి, కమిషనర్లు వీవీపీ నాయుడు, కె.శ్రీకాంత్ రెడ్డి, లోవరాజు సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి వి.జ్యోతిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ తల్లి జాతర

అమలాపురం రూరల్: మండలంలోని రోళ్లపాలెం గ్రామదేవత ముత్యాలమ్మ తల్లి అమ్మవారి జాతర మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు అమ్మవారికి చలివిడి, పానకాలు నైవేద్యంగా సమర్పించారు. సోమవారం రాత్రి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శక్తి వేషాలు, డప్పుల వాయిద్యాలతో గ్రామంలో అమ్మవారిని ఊరేగించారు.

మూల్యాంకన కేంద్రం వద్ద ఉపాధ్యాయుల నిరసన

అమలాపురం టౌన్: క్షేత్రస్థాయి పరిశీలన సందర్భంగా విద్యాశాఖ ఉన్నతాధికారుల తీరు అభ్యంతరకరంగా ఉంటుందని ఆరోపిస్తూ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో)కు చెందిన ఉపాధ్యాయులు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పదో తరగతి పరీక్షల మూల్యాంకన కేంద్రం వెలుపల మంగళవారం ఉదయం కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం నల్ల బ్యాడ్జీలు ధరించి మూల్యాంకన విధులకు హాజరయ్యారు. సుమారు 850 మంది ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో మూల్యాంకన విధులకు హాజరయ్యారని జిల్లా ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య చైర్మన్ శివ ప్రసాద్ నాగిరెడ్డి తెలిపారు.

పోలేరమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే అశోక్


ఎమ్మెల్యే అశోక్‌కు చిత్రపటం అందజేస్తున్న యువజన సంఘం సభ్యులు

యానాం: కనకాలపేట గ్రామదేవత పోలేరమ్మవారి జాతర మహోత్సవాల్లో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. మంగళవారం జరిగిన ఉత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పోలేరమ్మ యువజన సంఘ సభ్యులచే ఏర్పాటుచేసిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు అందరినీ అలరించాయి. బీజేపీ అధ్యక్షుడు కనకాలరాజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.